క్లుప్తంగా

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం



గన్నవరంరూరల్: పాడి రైతుల సంక్షేమమే కృష్ణామిల్క్ యూనియన్ లక్ష్యమని విజయా డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని కొండపావులూరులో బుధవారం రూ.3.80 లక్షలతో కొత్తగా నిర్మించిన పాలకేంద్రం నూతన నిర్మాణాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ పాడి రైతుల సమగ్ర శ్రేయస్సు కోసం బీమా, పెళ్ళి కానుక, గ్రామాలకే వచ్చి పశువులకు వైద్య చేయటం, సెమన్ అందించటం వంటి వినూత్న చర్యలతో వారి ఆర్థిక అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ బోనస్ సాధించటమే కాక, నూతన పాలకేంద్రంను నిర్మించిన అధ్యక్షుడు మిరియాల స్వామి, సభ్యులు, గ్రామ రైతులు అందరికీ ఆదర్శమన్నారు. ఇదే స్ఫూర్తితో పాడి రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కృష్ణామిల్క్ యూనియన్ డైరెక్టర్‌లు పాలడుగు నాని, పలగాని కొండలరావు, సహకార బ్యాంకు అధ్యక్షుడు కంచర్ల నాగబాబు, రూట్ మేనేజర్ కోట ప్రసాద్, ఉప్పుగంటి రాజేష్, సూపర్‌వైజర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌లపై సీఆర్‌డీఏ కొరడా



గన్నవరంరూరల్: అనుమతులు లేని అక్రమ లేఅవుట్‌లను ఉపేక్షించేది లేదని ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ హెచ్చరించారు. సీఆర్‌డీఏ పరిధిలోని గన్నవరం మండలం సూరంపల్లిలో అనుమతులు లేని అక్రమ లేఅవుట్‌లను బుధవారం ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది పొక్లెయిన్‌తో తొలగించారు. లే అవుట్‌లో రోడ్లు, ప్లాట్లకు వేసిన సరిహద్దు రాళ్లను తొలగించారు. వ్యవసాయ భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా రోడ్లను నిర్మించి ప్లాట్లుగా విడగొట్టి అమాయక ప్రజలకు విక్రయించటం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందని అధికారులు తెలిపారు. అనధికార లేఅవుట్‌లలో ప్లాట్లు అమ్మటం చట్టరీత్యా నేరమని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు నష్టపోవటంతో పాటు చట్ట ప్రకారం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. అనధికార లేఅవుట్‌లలో ప్లాట్లు కొన్నవారికి ఎటువంటి భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం జరగదని, మౌలిక వసతులకు ఇబ్బందులు పడతారని చెప్పారు. అనుమతులు పొందిన లేఅవుట్‌లలో మాత్రమే భవన నిర్మాణాలకు అనుమతులు లభిస్తాయన్నారు. అనధికార లేఅవుట్‌లు, కట్టడాల సమాచారం 70955 99838 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

భవానీ భక్తులకు అన్నదాన శిబిరం



హనుమాన్‌జంక్షన్‌రూరల్: అన్ని దానాలలో అన్నదానం గొప్పదని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఆరుమళ్ల శ్రీధర్ రెడ్డి అన్నారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ దుర్గ గుడికి కాలి నడకన తరలి వెళుతున్న భక్తుల కోసం బాపులపాడు మండలం బొమ్ములూరులో పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఆరుమళ్ల శ్రీధర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. పూర్తి సేవా దృక్పథంతో పుట్టగుంట సతీష్‌కుమార్ ఏటా భవానీ భక్తులకు అన్నదానం నిర్వహించటం అభినందనీయమని చెప్పారు. గత 14 ఏళ్లలో దాదాపు 2 లక్షల మంది భక్తులకు అన్నదానం చేశామని సతీష్ తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు భవానీ భక్తులకు అన్నదాన శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. శిబిరంలో ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లతో పాటుగా వృద్ధులు, మహిళల కోసం ప్రత్యేకంగా విశ్రాంతి, వైద్య సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యప్రదర్శన



పెనమలూరు: కానూరు గ్రామంలోని షామ్రాక్ ఇంటర్నేషనల్ పాఠశాలలో బుధవారం దసరా సంబరాల్లో భాగంగా శ్రీమహిషాసురమర్ధినిదేవి అలంకరణలో విద్యార్థినులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజు, ప్రెసిడెంట్ టి.మౌనిక సుమన్, ప్రిన్సిపాల్ భారతీధర్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంగళకారిణీ...శ్రీ మహాలక్ష్మీ నమోస్తుతే

వైభవంగా దసరా శరన్నవరాత్రులు

ఉయ్యూరు:మంగళకారిణి...శ్రీమహాలక్ష్మీ...అంటూ భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. దసరా నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు. ఉయ్యూరు పట్టణంలోని ఏజీకే నగర్‌లో శ్రీ విజయ దుర్గాభవాని దేవి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని విశేష పూజా కార్యక్రమాలు చేయించారు. ఉయ్యూరు శివాలయంలో శ్రీ జగదాంబ అమ్మవారు గజలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. ముదునూరు, పెద ఓగిరాల శివాలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

శ్రీ మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చిన పేరంటాలమ్మ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రులలో భాగంగా బుధవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీ వెంకమ్మ తల్లి మురళి కృష్ణ బృందం ఆధ్వర్యంలో కోలాటం, రాత్రి నాట్యాచార్య జోస్యుల శ్రీ రామ చంద్రమూర్తి బృందంచే భరతనాట్యం, జానపద నృత్యప్రదర్శన నిర్వహించారు. ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ఈవో పి.లోకేశ్వరి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

నున్న(విజయవాడరూరల్): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శ్రీమహాలక్ష్మిగా దర్శనమివ్వగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. నున్న గ్రామంలో చెరువు సెంటర్లోని శ్రీదుర్గాదేవి దేవస్థానంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకారం చేశారు. శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో అమ్మవారికి శ్రీమహాలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు. శ్రీచక్రానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మి అలంకారంలో వున్న అమ్మవారికి పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. చినకంచిలో కామాక్షి అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. పి.నైనవరం గ్రామం శివనాగేంద్రస్వామి ఆలయంలో అమ్మవారికి శ్రీమహాలక్ష్మి అలంకరించి పూజలు నిర్వహించారు. అంబాపురం గ్రామంలో శ్రీకనకదుర్గ దేవాలయంలో అమ్మవారికి శ్రీమహాలక్ష్మిగా అలంకరించారు.



ఉయ్యూరులోని శ్రీ విజయదుర్గాభవాని దేవి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి దేవిగా అమ్మవారు

గన్నవరంలో...

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో బుధవారం శ్రీమహాలక్ష్మీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సొసైటీపేటలోని శ్రీగాయత్రీదేవి మందిరంలో శ్రీమహాలక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులతో పూజలందుకున్నారు. అనంతరం సప్తశతి చండీ హోమం నిర్వహించారు. స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారి సన్నిధిలో పలువురు దంపతులతో పూజా కార్యక్రమాలు జరిపారు. శ్రీపెద్దమ్మతల్లి, శ్రీకనకదుర్గమ్మ ఆలయాలు, యాదవ రామాలయంలో దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

కంకిపాడులో...

కంకిపాడు: కంకిపాడు శివాలయం, ఈడుపుగల్లు శివాలయాల్లో అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. ప్రొద్దుటూరు శివాలయంలో కాశీఅన్నపూర్ణాదేవి మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి తామరపూలతో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ మాత శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తుల పూజలందుకున్నారు. ప్రొద్దుటూరు గాయత్రీవిహార్‌లో ధ్యానయోగ సాయి మందిరంలో మహాలక్ష్మీ దేవి అలంకారంలో అమ్మవారిని భక్తులు పూజించారు. మద్దూరులో విజయ దశమి ఉత్సవాల్లో భాగంగా వణుకూరుకు చెందిన శ్రీ నటరాజ నృత్య అకాడమీ బృందం ఇచ్చిన ప్రదర్శన అలరించింది.



శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో పేరంటాలమ్మ



మద్దూరులో నృత్య ప్రదర్శన ఇస్తున్న శ్రీ నటరాజ నృత్య అకాడమీ బృందం

శ్రీ మహాలక్ష్మీదేవిగా అమ్మవారు

పెనమలూరు: మండల పరిధిలో వివిధ ఆలయాల్లో బుధవారం అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. గోసాల వైకుంఠపురంలో శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా సామూహిక కుంకుమార్చనలు దేవర కొండ బుజ్జి వెంకటరామ సిద్ధాంతి ఆధ్వర్యంలో చేశారు. పోరంకి శ్రీనివాసానగర్‌లో షిర్డి సాయిబాబా మందిరంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. యనమలకుదురు శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో, పెదపులిపాక శ్రీవిజయరాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవార్లను శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. యనమలకుదురులో శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో అమ్మవారిని కూష్మాండదేవిగా అలంకరించారు.

పురుషోత్తపట్నంలో...

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారిని పలు ఆలయాల్లో మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. పురుషోత్తపట్నం శివాలయంలో మహాలక్ష్మీ అవతారాన్ని భక్తులు దర్శించారు.



కంకిపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా వాసవీ మాత



గోసాల వైకుంఠపురంలో అమ్మవారి అలంకరణ



ప్రొద్దుటూరు శివాలయంలో శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకారంలో కాశీ అన్నపూర్ణాదేవి

ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



తాడిగడపలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: గత నాలుగున్నర సంవత్సరాలుగా జగనన్న రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పాలనను అందిస్తున్నారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడప రామానగర్ కాలువ కట్టపై బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి నిర్వహించారు. ప్రజలకు సంక్షేమ ఫలాల బుక్‌లెట్ అందించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న పాలనపై ప్రతిపక్షాలు కుట్ర పూరితంగా చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని అన్నారు. జగనన్న పాలనలో పేదలు అభివృద్ధి చెందుతుంటే చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు బురద జల్లుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రకాశరావు, అసిస్టెంట్ కమిషనర్ అభినేష్, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, వైఎస్సార్ సీపీ నేతలు నర్రా చంటి, కాకి శ్రీనివాసరావు, పోలవరపు బాబి, పి.సాంబయ్య, వెలిశిల ప్రసాద్, కిషోర్, ముజీబ్, జిన్నా, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మి, క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలవటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోసాలకు చెందిన లంక తిరుగణేష్ బైక్‌లో పెట్రోల్ పోయించుకోవటానికి గంగూరు వచ్చాడు. అతను పెట్రోల్ పోయించుకుని తిరిగి గోసాలకు వెళుతుండగా గోసాలకు చెందిన బంటుమిల్లి బుచ్చిబాబు ఎదురుగా బైక్‌పై వచ్చి గణేష్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో గణేష్‌కు గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ రామిరెడ్డి

కంకిపాడు: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ రామిరెడ్డి అన్నారు. మండలంలోని దావులూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ సుధా ప్రసూజ, డాక్టర్ సంతోష చంద్రిక, డాక్టర్ మురళి, డాక్టర్ రాఘవ, కంటి వెలుగు ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి. రాజేష్‌కుమార్ రోగులకు వైద్య సేవలు అందించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, సర్పంచ్‌లు కొప్పుల లక్ష్మి, బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి రోగులకు మందులు అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, ప్రత్యేకాధికారులు జి.విజయలక్ష్మి, షాహిద్‌బాబు, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీఓ పి.అనూష, ఎంపీటీసీలు బేతపూడి సురేష్, కొలుసు రాజేశ్వరి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, ఈఓ కూర్మారావు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఎనికేపాడులో 500 మందికి జగనన్న ఆరోగ్య సురక్ష

రామవరప్పాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు ఉచితంగా సంపూర్ణ వైద్య సేవలు అందుతున్నాయని గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు సచివాలయం-2 పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఉచితంగా వైద్యసేవలు అందించారు. గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షను గ్రామస్తులు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. అనంతరం సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సువర్ణరాజు, మాదు సుబ్బారావు, పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు పొట్టిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

ఉంగుటూరు: పొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వివిధ విభాగాల స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు.

ప్రజల ఆరోగ్య భద్రత ప్రభుత్వ లక్ష్యం

పెనమలూరు: అందరి ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యమని తాడిగడప మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ కె.అభినేష్ అన్నారు. తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నేతలు కటికల క్రిస్టోఫర్, నల్లమోతు జీవన్, వైద్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దావులూరు గ్రామంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ రామిరెడ్డి



తిప్పనగుంట శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజలందరికీ ప్రభుత్వ వైద్యం

గన్నవరంరూరల్: మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీపీ అనగాని రవి ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచ్ మాదల రోహిణి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఆర్.వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, డాక్టర్ శివప్రసాద్, సీనియర్ నాయకుడు చెరుకూరి రామ్మోహనరావు, కొమ్మినేని పార్థసారథి, ఎంపీడీవో సత్యకుమార్, గ్రామ పార్టీ కన్వీనర్ బండి ప్రభుదాస్, పంచాయతీ కార్యదర్శి కోట సురేష్‌బాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా 506 మందికి వైద్య సేవలందించారు.

తిప్పనగుంటలో...

హనుమాన్‌జంక్షన్ రూరల్: గడిచిన నాలుగున్నర ఏళ్లలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని పలువురు ప్రజాప్రతినిధులు చెప్పారు. బాపులపాడు మండలం తిప్పనగుంటలోని గ్రామ సచివాలయం ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ కలపాల భీమయ్య ప్రారంభించారు. వీరవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్మయి నేతృత్వంలోని వైద్యుల బృందం గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 431 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ పాల్గొన్నారు.



దావులూరులో రోగులకు మందులు అందిస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ తదితరులు



తాడిగడపలో మందులు అందజేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ అభినేష్



పురుషోత్తపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ప్రారంభించిన ఎంపీపీ అనగాని రవి

సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- కృష్ణా కలెక్టర్ రాజాబాబు
- ఉయ్యూరులో 'జగనన్నకు చెబుదాం'

ఉయ్యూరు(పెనమలూరు): సమస్యకు శాశ్వత పరిష్కారమే జగనన్నకు చెబుదాం అంతిమ లక్ష్యమని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని కాకర్ల కన్వెన్షన్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీఆర్‌ఓ పెద్ది రోజా, ఆర్‌డీఓ విజయ్ కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు రాజాబాబు ఆదేశించారు. కాటూరు రోడ్డులో హనుమాన్ నగర్‌లో నిషేధిత భూముల సమస్య, వక్ఫ్‌బోర్డు భూముల సమస్యను జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు దృష్టికి ఎమ్మెల్యే పార్థసారథి తీసుకెళ్లారు. పరిష్కరించాల్సిందిగా కోరారు. జగనన్న లే అవుట్‌లలో మెరక పనులపై డ్వామా పీడీ సూర్యనారాయణతో ఎమ్మెల్యే సమీక్షించి చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు.

సంతృప్తికర పరిష్కారం..

సంతృప్తికరస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. సోమవారం జిల్లా ప్రధాన కేంద్రంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి ప్రజలు వస్తున్నారని, అయితే క్షేత్రస్థాయికే వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం రూపొందించారని వివరించారు. జిల్లాలో ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉయ్యూరు పట్టణం, మండల స్థాయిలో నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో విద్యుత్, రహదారులు, డ్రెయిన్లు, పింఛన్లు తదితర సమస్యలపై అర్జీలు అందాయన్నారు. ఆయా అర్జీలపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కార చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు. కోర్టు వివాదం లేని ప్రతి సమస్య పరిష్కారమవుతుందన్నారు. రీ ఓపెన్ అర్జీల సమస్యలకు సంతృప్తికర పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై మొత్తం 32 అర్జీలు, రీ ఓపెన్ అర్జీలు అందాయి. డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి, డీఈఓ తాహెరా సుల్తానా, డీఆర్‌డీఏ పీడీ ప్రసాద్, డీఎస్ఓ పార్వతి, పౌరసరఫరాల శాఖ డీఎం శ్రీధర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి, మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.



నిషేధిత భూముల సమస్యను కలెక్టర్, ఎమ్మెల్యేకు వివరిస్తున్న కౌన్సిలర్ డాక్టర్ జంపాన పూర్ణిమ

వచ్చిన సమస్యల్లో కొన్ని..

- ఉయ్యూరు పట్టణంలోని కాటూరు రోడ్డు హనుమాన్ నగర్ కాలనీ వాసులు తమ స్థలాలు, ఇళ్లను 22ఏ జాబితా నుంచి తొలగించాలని కౌన్సిలర్ డాక్టర్ జంపాన పూర్ణిమ అర్జీ ఇచ్చారు.
- ఉయ్యూరు శివారు నాగన్నగూడెం జగనన్న కాలనీకి వెళ్లే రహదారులను అభివృద్ధి చేయాలని ఆ వార్డు కౌన్సిలర్ గుంజా సుధాకర్ బాబుతో పాటు స్థానికులు అర్జీ ఇచ్చారు.
- ఉయ్యూరు మండలం బోళ్లపాడులో ఎస్సీ మాదిగలకు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని గ్రామ సర్పంచ్ తుమ్మూరు సురేష్‌రెడ్డి విన్నవించారు.

రూరల్ మండలంలో వీఆర్వోలకు దుర్గగుడి విధులు

విజయవాడరూరల్: దసరా మహోత్సవాల సందర్భంగా విజయవాడ రూరల్ మండలంలోని వీఆర్వోలను ఇంద్రకీలాద్రిపై విధులకు నియమించారు. మండలంలో మొత్తం 32 మంది వీఆర్వోలుండగా అందరూ షిఫ్టుల వారీగా ఇంద్రకీలాద్రి విధులకు హాజరవుతున్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు, రాత్రి 10 నుంచి ఉదయం 7 గంటల వరకు మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. మహిళా వీఆర్వోలను మాత్రం ఉదయం పూట షిఫ్టుల్లోనే నియమిస్తున్నారు.



దసరా శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో బుధవారం గన్నవరం శాసనసభ్యుడు వల్లభనేని వంశీమోహన్ కుమార్తె లక్ష్మీ వసుంధర తన భరత నాట్య ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆమెను ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి సత్కరించారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

కంకిపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లు సమర్థంగా పూర్తి చేయాలని కృష్ణాజిల్లా కలెక్టరు పి.రాజాబాబు ఆదేశించారు. కంకిపాడు పట్టణంలోని అయానా ఫంక్షన్ హాలులో ఈనెల 19వ తేదీ రాత్రి జరిగే ఒక వివాహ వేడుకకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫంక్షన్ హాలు ప్రాంగణాన్ని గుడివాడ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని)తో, అధికారులతో కలిసి సందర్శించి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఫంక్షన్ హాలుకు చేరుకునే రోడ్డు మరమ్మతులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను అధిగమించేందుకు వైద్యులు, అంబులెన్సు సదుపాయాలను సిద్ధం చేయాలని డీఎంహెచ్‌ఓ గీతాబాయికి సూచించారు. సమావేశంలో ఆర్డీఓ ఎన్.విజయ్‌కుమార్, జాతీయ రహదారుల శాఖ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అయానా ఫంక్షన్ హాల్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టరు రాజాబాబు, ఎమ్మెల్యే కొడాలి నాని